క్లుప్తంగా

నిధుల మంజూరుకు వినతి



ఎమ్మెల్యే సత్యంను సన్మానిస్తున్న సంఘం నాయకులు

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లికి చెందిన పద్మశాలీ సమాజ సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. సంఘం భవన నిర్మాణ మిగులు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపతి దేవయ్య, పచ్చునూరి సుధాకర్, ఆడెపు నర్సయ్య, కాంపూరి తిరుపతి, పెంట లక్ష్మిరాజం, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ర్యాలీ



ర్యాలీతీస్తున్న విద్యార్థులు

ఇల్లంతకుంట: ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా మండలంలోని కందికట్కూర్, అనంతారం, హై స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీతీశారు. కందికట్కూరు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు కథల పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో చెప్యాల శ్రీనివాస్ గౌడ్, హెచ్ఎం కే. శ్రీనివాసరెడ్డి, బి.రవీందర్ రెడ్డి, రాజు, లక్ష్మి, తదితరులు, పాల్గొన్నారు.

ఆలయానికి గ్రానైట్ అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఎంపీ నిధుల నుంచి బోర్ మోటార్‌తో పాటు హనుమాన్ ఆలయానికి గ్రానైట్ మంజూరు చేసినట్లు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేశ్ సోమవారం తెలిపారు. ఆలయానికి 620 ఫీట్ల గ్రానైట్ అందించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు కిషన్, వినోద్, చాట్ల తిరుపతి, కిషోర్, సంతోష్ ఉన్నారు.

వీర్నపల్లి: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మండలంలోని గర్జనపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కూలేరి ప్రేమ్‌సాగర్, సిబ్బంది మంజుల, సుల్తాన్ శ్రీనివాస్, కవిత, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత వస్తువులకు వేలం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 17వ పోలీస్ బెటాలియన్ సర్దాపూర్‌లో పాత టైర్లు, బ్యాటరీలు, పాత ఇతర సామగ్రికి 9న నుంచి రెండ్రోజులు వేలం వేయనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ ఎంఐ సురేశ్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 8712657570, 9652608026 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో

కోనరావుపేట: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి మురళినాయక్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపికచేసి సోమవారం ఘనంగా సన్మానించారు. మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు పాఠశాలల్లో పనిచేస్తున్న 13 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారిని సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలో 20 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాస్, ఎంపీడీవో ఎల్.రాధ, మండల విద్యాధికారి వినయ్‌కుమార్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. సోమవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ.. మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై రాహుల్‌రెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, పీడీ శ్రీనివాస్, అక్బర్, సునంద, దివ్య, ప్రధానోపాధ్యాయుడు మనోహరచారి, మధుమాలతి, మురళీధర్, కుమారస్వామి, చంద్రశేఖర్, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

శివారులో అంధకారం

- మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వెలగని వీధిలైట్లు
- నిత్యం ప్రమాదాలు, చోరీలు
- పట్టించుకోని అధికారులు
- విద్యుద్దీపాల నిర్వహణకు జీపీలపైనే భారం



ఎల్లారెడ్డిపేట నుంచి నారాయణపూర్ వెళ్లే రోడ్డులో అలుముకున్న చీకటి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతోపాటు గ్రామాల శివారుల ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలంలోని మేజర్ గ్రామపంచాయతీతో పాటు శివారు గ్రామాల్లో అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారులు, వీధుల వెంట అమర్చిన ఎల్‌ఈడీ లైట్లు పనిచేయకపోగా వాటి మరమ్మతును గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుద్దీపాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆ భారం జీపీలపైనే పడుతోంది. కొత్త విద్యుత్ దీపాల ఏర్పాటు, మరమ్మతును జీపీలు పట్టించుకోవడం లేదు.

నిత్యం ప్రమాదాలు

మండలకేంద్రంలోని కొన్ని ప్రాంతాల్లోనే విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున నిధులు కేటాయించి కొంతవరకే విద్యుద్దీపాలను అలంకారప్రాయంగా మార్చగా, శివారు ప్రాంతాలు చీకట్లోనే ఉంటున్నాయి. వీధిలైట్లు లేకపోవడంతో చీకట్లోనే వాహనదారులు రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ..

శివారు ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గంజాయి, గుడుంబా, గుట్కా లాంటివి సేవించడమే కాకుండా ఆ ప్రాంతాల్లోని మహిళలు నివాసాల్లోంచి బయటకు వస్తే వారిపై దురుసుగా ప్రవర్తించడం, లైంగిక దాడులకు పాల్పడడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులు చేసి దొంగతనాలకు పాల్పడడం పరిపాటిగా మారింది.

జీపీలపై భారం..

గ్రామ పంచాయతీలపై విద్యుద్దీపాల నిర్వహణకు రూ.లక్షల్లో నిధులు కేటాయించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆ భారం జీపీలపై పడుతోంది. ఇప్పటికే సిబ్బంది జీతాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు, ట్రాక్టర్ల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండగా మరోవైపు ఇందుకు రెట్టింపుస్థాయిలో విద్యుద్దీపాల నిర్వహణకు రూ.లక్షల్లో ఖర్చుచేయాల్సి వస్తోంది. ఫలితంగా మేజర్ గ్రామపంచాయతీల్లో శివారు ప్రాంతాలతో పాటు మరమ్మతుకు ఉన్న ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది.

నిధులు కేటాయించాలి



మండలకేంద్ర శివారులో వీధిలైట్లు లేక అంధకారం నెలకొంది. చీకట్లో రోడ్లు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలి.

– వంగల లింగారెడ్డి, నారాయణపూర్

పంచాయతీలపై భారం



వీధిలైట్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో గ్రామపంచాయతీపైనే భారం పడుతోంది. కొద్దిపాటి ఆదాయంతో ఇతర ఖర్చులకే ఇబ్బంది తలెత్తుతుంది. వీధిలైట్ల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. జీపీ నుంచి కొత్తగా వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి, ఎల్లారెడ్డిపేట

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్శరాములు



నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు కోరారు. కలెక్టరేట్ వద్ద బీసీ హక్కుల కోసం సోమవారం చేపట్టిన నిరసన దీక్షలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని బీసీలందరూ పార్టీలకతీతంగా ఐక్యంగా ముందుకురావాలన్నారు.

కెనాల్ భూముల పరిరక్షణకు చర్యలు



విచారణ చేపడుతున్న ఇరిగేషన్ అధికారులు

ముస్తాబాద్: మండలంలో మల్లన్నసాగర్ కెనాల్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని డీఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. చీకోడు, నామాపూర్, మద్దికుంట, మోహినికుంట, రాజక్కపేటలోని మల్లన్నసాగర్ కెనాల్ పరివాహక భూముల్లో ఎవరు ఆక్రమించరాదన్నారు. ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు చేయవద్దన్నారు. ఇటీవల కెనాల్ భూములు ఆక్రమించారన్న ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. కెనాల్ భూములు ఆక్రమిస్తే భవిష్యత్‌లో నీటి సరఫరాకు ఇబ్బంది తలెత్తుందని, రైతులు సహకరించాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

డీఏ బకాయిలు విడుదల చేయాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలలో సభ్యత్వం స్వీకరించి అనంతరం మామిడిపల్లిలో కోనరావుపేట మండలశాఖ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ఎన్నికల అధికారిగా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం వ్యవహరించారు. ఎన్నికల్లో ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా బి. రవి, మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా చంద్రశేఖర్, ఆర్థిక శాఖ సభ్యులుగా శ్రీనివాస్, రజిత, మండల ఉపాధ్యక్షులుగా గంగాధర్, మండల మహిళా ఉపాధ్యక్షులుగా శారద, అపర్ణ, జిల్లా కార్యదర్శులుగా రవి, రమాకాంత్, మండల కార్యదర్శులుగా శ్యామ్, జి. శేఖర్, ప్రవేశిక, సమీణ బాపును ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మొగిలి లక్ష్మణ్, రేవోజు సదానందం వారిని అభినందించారు. గతంలో విడుదల చేసిన జీవో నంబర్ 3 ప్రకారం బకాయిలు విడుదల చేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు


• కరాటేలో విద్యార్థుల ప్రతిభ

వేములవాడ: ఈనెల 7న కరీంనగర్ రెవిన్యూ గార్డెన్స్‌లో నిర్వహించిన కుంగ్ ఫూ, కరాటే టోర్నమెంట్‌లో వేములవాడకు చెందిన 95 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చగా 85 మంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ గగ్గురి దివ్య సోమవారం తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ ఎనగందుల శ్రీనివాస్ ట్రోఫీలను అందజేశారు.

• సర్టిఫికెట్లు అందజేత

ఒకినవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే అకాడమీ ఫౌండర్ చీఫ్ ఎగ్జామినర్ అబ్దుల్ మన్నాన్ విద్యార్థులకు పట్టణంలోని మహదేవ్ ఫంక్షన్ హాల్‌లో కరాటే గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. 80 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చగా సర్టిఫికెట్లు సాధించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు దండగల తిరుపతి, లోలపు రాజు, కనికరపు రాజశేఖర్, ఫర్హాన్ అబ్బాసిలు పాల్గొన్నారు.

• శివకేశవుల ఆలయ కమిటీ చైర్మన్‌గా శెరయ్య



ముస్తాబాద్: మండలకేంద్రంలోని శ్రీశివకేశవుల ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మిడిదొడ్డి శెరయ్య ఎన్నికయ్యారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ పదవికి బద్దిపడిగె ప్రతాప్‌రెడ్డి, కంచం నర్సింలు, జాల భిక్షపతి, మిడిదొడ్డి శెరయ్య, రామచంద్రం పోటీపడ్డారు. చైర్మన్ పదవి ఎన్నికకు డ్రా తీశారు. డ్రా పద్ధతిలో మిడిదొడ్డి శెరయ్యను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా శ్రీనివాస్, కోశాధికారిగా అగుళ్ల రాజేశంను ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని శెరయ్య పేర్కొన్నారు. మరో 20 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు.

• విద్యకు ప్రాధాన్యం

ఇల్లంతకుంట: ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తుందని మండల విద్యాధికారి సీహెచ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో న్యూ ఇండియా లిట్రసీపై సమావేశం నిర్వహించారు. 15 ఏళ్లు పూర్తయి పదో తరగతిలో ఫెయిల్ అయిన అభ్యర్థులు ఓపెన్ స్కూల్‌లో చదివేలా చూడాలన్నారు. రిసోర్స్ పర్సన్లు సందీప్ రెడ్డి, యాద రవి, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీవోఏలు పాల్గొన్నారు.

• ఫిజియోథెరపీ దినోత్సవం

వేములవాడ: ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవాన్ని తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్టు (టీఏపీ) రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో వేములవాడలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలసాని శ్రీనివాస్ ఫిజియోథెరపీ వైద్య సేవలందిస్తున్న వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజాదిత్య, రామకృష్ణ, జనరల్ సెక్రటరీ డాక్టర్ రాజేశ్, జాయింట్ సెక్రటరీ మయూరి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ మహతి, ట్రెజరర్ డాక్టర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ శివారులోని గాజులపల్లి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు..గాజులపల్లి వద్ద రోడ్డు దాటుతున్న గొర్రెలను చీకట్లో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంభీరావుపేట మండలానికి చెందిన తండ్రీ కొడుకులతో పాటు గాజుపల్లికి చెందిన గొర్రెల కాపరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని 108లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ(కేజీబీవీ)న్ని సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, వంటగది, స్టోర్ రూమ్, ఆర్వో ప్లాంట్, భోజనానికి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కేజీబీవీ ఆవరణను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కేజీబీవి స్పెషల్ ఆఫీసర్ శ్యామల, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని ధర్నా

సిరిసిల్ల అర్బన్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీమేరకు వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులకు పింఛన్లు పెంచాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాట్లాడుతూ ఇప్పటికైనా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి, అర్హులైన వారందరికీ పింఛన్లు పెంచాలన్నారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఖానాపురం లక్ష్మణ్, భిక్షపతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగిపై విచారణ

వేములవాడ: రాజన్న ఆలయ రిటైర్డ్ ఉద్యోగి రాజేందర్‌పై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సోమవారం శాఖాపరమైన విచారణ చేపట్టినట్లు సమాచారం. ఏసీబీ కేసు పూర్తయిన తర్వాత శాఖాపరమైన విచారణ పెండింగ్ ఉంది. రాష్ట్ర దేవాదాయశాఖ ఇన్‌చార్జి ఆర్‌జేసీ రామకృష్ణారావు విచారణ అధికారిగా హాజరయ్యారు. ఏసీబీ నుంచి సీఐ కృష్ణకుమార్ విచారణను పూర్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగి సమక్షంలో కేసు పూర్వాపరాలను పరిశీలించి శాఖాపరమైన విచారణ పూర్తి చేసినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. నివేదిక అనంతరం ఉద్యోగికి రావాల్సిన బెనిఫిట్స్ అందనున్నాయని చర్చించుకున్నారు.

రోడ్డు మరమ్మతు

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే డబుల్ రోడ్డులో దేశాయిపల్లి వరదకాలువ కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాలతో సోమవారం గుంతల్లో మొరం పోసి కాంగ్రెస్ నాయకులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రూ.35 లక్షల అంచనాలతో బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మెన్ ఎల్లేశ్‌యాదవ్, వీసీ నిమ్మ వినోద్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొడగాని వెంకటేశ్, ఎమిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొంకటి మధు తదితరులున్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలో గణేశ్ నవరాత్రోత్సవాలు, నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, శోభాయాత్ర సాగడంలో కృషిచేసిన సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రాహుల్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముస్లిం కమిటీ, నేతాజీ సేవా సమితి వారు సత్కరించారు. సమితి ప్రతినిధులు దినేష్‌గౌడ్, మారవేణి రంజిత్‌కుమార్, రాము, వినయ్, ముస్లిం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

10న స్థానిక సంస్థల తుది ఓటర్ జాబితా

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో ఈనెల 10న స్థానిక సంస్థల తుది ఓటర్ జాబితా ప్రచురిస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం స్థానిక సంస్థల ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాపై రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు డ్రాఫ్ట్ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను విడుదల చేశామన్నారు. 650 ఓటర్లకు ఒక పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో 123 ఎంపీటీసీ సభ్యుల స్థానాలు, 12 జెడ్పీటీసీల స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని, వీటి పరిధిలో 3,53,351 ఓటర్లు ఉన్నారని తెలిపారు. 278 లొకేషన్స్‌లో 712 పోలింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 8లోపు అందించాలని కోరారు. జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, రాజకీయ పార్టీ నాయకులు తోట ఆగయ్య, రెడ్డబోయిన గోపీ, గజభీంకార్ రాజన్న, మూషం రమేశ్, తీగల శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వేములవాడ: రేకుర్తి కంటి ఆసుపత్రి సౌజన్యంతో వేములవాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి సోమవారం స్పందన లభించింది. పట్టణంలోని మాతృశ్రీ హాస్పిటల్‌లో వైద్యులు చింతల ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ బృందం 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 38 మందికి ఆపరేషన్ అవసరమున్నట్లు గుర్తించారు. ఆపరేషన్ అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లయన్స్ ప్రతినిధులు బచ్చు వంశీకృష్ణ, డాక్టర్ కోయినేని ప్రవీణ్, ఆనందరెడ్డి, కోళ్ల శ్రీనివాస్, కొలిపాక నర్సయ్య, వెంకటేశ్వర్‌రావు, గోస్కుల రవి, సంతోష్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయానికి సబ్‌స్టేషన్ మంజూరు

వేములవాడ: రాజన్న ఆలయానికి ఆధునిక విద్యుత్ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణంలో రూ.2.18కోట్లతో 33/11 కేవీ సామర్థ్యంతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈమేరకు రాష్ట్ర విద్యుత్ సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి అధికారిక ఉత్తర్వులు జారీచేశారని చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణంతో దేవస్థానంలో లో-వోల్టేజీ సమస్యకు చెక్ పడనుంది.

ఏఎన్‌ఎంల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు, నాయకులు

సిరిసిల్ల అర్బన్ : ఎన్‌సీడీ ప్రోగ్రాంలో ఆన్‌లైన్ నుంచి అన్నిరకాల ఏఎన్‌ఎంలకు మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ ప్రో గ్రాం నుంచి ఏఎన్‌ఎంలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ జిల్లాలోని ఏఎన్‌ఎంలు నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంలు ఇప్పటికే ఆన్‌లైన్ వర్క్‌తో డ్యూటీలతో గంటల తరబడి పనిచేస్తున్నారన్నారు. అదనంగా ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆన్‌లైన్ చేయమనడంతో ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్‌సీడీ పని నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు. ఏఐటీయూసీ నాయకులు, ఏఎన్‌ఎంలు ఇందిరా, అరుణ, వనజ, వసంత, స్వప్నదేవి, అనిత, శ్రావణి తదితరులున్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



వేములవాడ అర్బన్: మాట్లాడుతున్న ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా

వేములవాడఅర్బన్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీల తుది జాబితా, పోలింగ్ స్టేషన్ల తుది జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలపాలన్నారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ పార్టీల మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, వరుస కృష్ణహరి, రేపాక రామచంద్రారెడ్డి, చెట్కూరి నారాయణగౌడ్, ఎంపీవో జోగం రాజు తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా, అభ్యంతరాల స్వీకరణ కోసం మండల రాజకీయ పార్టీలతో ఎంపీడీవో బీమా జయశీల సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 9న జెడ్పీ సీఈవో వినోద్ అభ్యంతరాల పరిశీలిస్తారని, 10న తుదిజాబితా నోటీసు బోర్డుపై అంటించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ మండల నాయకులు పాల్గొన్నారు.

రీడింగ్‌తో పఠనాసక్తి పెంపు



ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రీడింగ్ కార్యక్రమంతో విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూం టూ రీడ్ సంస్థ సహకారంతో గతనెల 20 నుంచి పాఠశాలలో ప్రత్యేక రీడింగ్ క్యాంపెన్‌కు శ్రీకారం చుట్టగా సోమవారం ముగిసింది. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తకాలు చదివే అలవాటు పెంచడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రంగి: మండలకేంద్రంలోని ఇందిరాచౌక్ రోడ్డు నుంచి కుక్కల గండి తండా వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.4.57 కోట్ల ట్రైబల్ వెల్ఫేర్ నిధులు మంజూరు కావడంపై తండా గిరిజనులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఇందిరాచౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, గండి నారాయణ, తర్రె లింగం క ట్యూల్ దాస్, గంధం మనోజ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి పరిధిలో మరో ఎంపీటీసీ స్థానం ఏర్పాటుచేయాలని అఖిల పక్ష నాయకులు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. బద్దెనపల్లి ఎంపీటీసీ పరిధిలో పద్మనగర్, ఇందిరమ్మకాలనీ లుండగా అదనంగా కేసీఆర్‌నగర్ ఓట్లను కలపడంతో కొత్త చిక్కులు వస్తున్నాయన్నారు. నిబంధనల ప్రకారం ఒక ఎంపీటీసీ స్థానానికి 5వేల ఓట్లు మాత్రమే ఉండాలని, ప్రస్తుతం కేసీఆర్‌నగర్‌ను కలపడంతో 5,600 ఓట్లు అవుతున్నాయన్నారు. మరో ఎంపీటీసీ స్థానం పెంచాలని లేకపోతే ఇందిరమ్మకాలనీ, కేసీఆర్‌నగర్ ఓటర్లను బద్దెనపల్లి ఎంపీటీసీ పరిధిలో నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రవీణ్ జె టోని, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, సీపీఐ నాయకులు సోమ నాగరాజు, నాయకులు గుగ్గిళ్ల అంజయ్య, కందుకూరి రామాగౌడ్, ఎగుర్ల ప్రశాంత్, సిలివేరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.